క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

భూదాన్‌పోచంపల్లి : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తును సర్వే చేయాలన్నారు. పొరపాట్లకు తావివ్వకుండా సర్వే పకడ్బందీగా చేపట్టి ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మహేందర్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్‌కు నివాళి

భువనగిరిటౌన్ : దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన యువ కిశోరాలు పండిట్ రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖ్ ఉల్లా ఖాన్ వర్ధంతిని గురువారం ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బాబు జగజ్జీవన్ రాం విగ్రహం వద్ద వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకరం కోటం రాజు విమర్శించారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని కూరెళ్ల నర్సింహ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఽ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న నేటికీ కార్మిక శాఖ మంత్రిని నియమించలేదన్నారు. సమావేశంలో గొరిగే సోములు , నర్సింహ, తూటి వెంకటేష్, కళకుంట్ల శివకుమార్, కృష్ణ, వంగాల మారయ్య, జంపాల మహేష్ పాల్గొన్నారు.

పచ్చలకట్ట సోమేశ్వరాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా రాజు

భువనగిరి : పట్టణంలోని శ్రీ పచ్చలకట్ట సోమేశ్వరాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా కొల్లూరి రాజును నియమిస్తూ గురువారం రాష్ట్ర దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ట్రస్ట్ సభ్యులుగా నరాల జంగయ్య, సోమ రవీందర్‌రెడ్డి, బచ్చు రాజేంద్రప్రసాద్, కాల్వ స్వాతి, కప్పగంతుల నాగరాజు శర్మలను నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇష్టపడి చదవాలి

భూదాన్‌పోచంపల్లి : విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని విజ్ఞాన్ యూనివర్సిటీ స్టూడెంట్స్ ఎఫైర్స్ కో ఆర్డినేటర్లు డాక్టర్ అమీనా, డాక్టర్ హేమ అన్నారు. గురువారం మండల శివారులోని కవాడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, స్టేషనరీ వస్తువులతో పాటు స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెపీ రావు, స్టూడెంట్ వాలంటీర్లు ప్రహర్షిత, అంజనీ, వంశీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలను పెంచాలని వినతి

చౌటుప్పల్ : వేతనాలను పెంచేందుకు కౌన్సిల్‌లో తీర్మాణం చేయాలని కోరుతూ పారిశుద్ధ్య కార్మికులు గురువారం మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహరెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పారిశుద్ధ్య కార్మికులు లావణ్య, లక్ష్మమ్మ, సత్తమ్మ, సునీత, లింగమ్మ, స్వప్న, ఝాన్సీ, పద్మ, మల్లీశ్వరి, సురేష్, అశ్విని, యాదయ్య, ముత్యాలు, విజయ, అనిత, యాదమ్మ, శ్యామల, సంపూర్ణ, సబిత, పరమేష్, యాదయ్య పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

మోత్కూరు : మోత్కూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మోత్కూరులోని హైస్కూల్ చౌరస్తా వద్ద బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, లింగంపల్లి రఘువర్ధన్, మండల నాయకులు బీసు మధు, సిరిగిరి మస్తాన్, నర్సింహ్మ, భిక్షపతి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఆలేరురూరల్ : పట్టణ కేంద్రంలో ఏసీపీ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, ఒక కారును సీజ్ చేశామని తెలిపారు. ఆయన వెంట సీఐ కొండల్‌రావు, ఎస్సై రజినీకర్, ఏఎస్సై ఆంజనేయులు, కిరణ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

బొమ్మలరామారం : మత్తు పదార్థాలకు బానిస కావొద్దని వైద్యులు ఆర్.మధు, పీఎస్ మహాలక్ష్మి అన్నారు. ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వస్థియ కార్యక్రమం)లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ విద్యార్థులకు మత్తు పదార్థాలు వినియోగిస్తే కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఫార్మసిస్ట్ రేణుక, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశ వర్కర్ పుష్ప పాల్గొన్నారు.

- ఊడుతున్న పెచ్చులు
- భయాందోళనలో సిబ్బంది

శిథిలావస్థలో ఎమ్మార్సీ భవనం

బీబీనగర్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం శిథిలావస్థకు చేరింది. ఏళ్ల తరబడి భవనం మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఎమ్మార్సీ భవనం సమావేశ మందిరం, గదుల్లో స్లాబ్ పెచ్చులూడుతోంది. భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో సిబ్బంది భయంభయంగా విధులకు హాజరవుతున్నారు. ప్రతినెల ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించడం కూడా కష్టంగా మారింది. సమావేశాలు, ఇతర పనుల నిమిత్తం అక్కడికి వచ్చే విద్యాధికారులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు.

25ఏళ్ల క్రితం నిర్మించడంతో..

బీబీనగర్‌లోని మండల వనరుల విద్యా కేంద్రం భవనాన్ని నిర్మించి 25ఏళ్లు కావొస్తోంది. భవనం నిర్మించిన నాటి నుంచి ఇప్పటివరకు కనీస మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో భవనం స్లాబ్ నుంచి పెచ్చులూడుతున్నాయి. ఇనుప చువ్వలు తేలాయి. గోడలు నిమ్ము రావడంతో భవనం కూలే పరిస్థితి నెలకొంది. వర్షాలు పడినప్పుడు స్లాబ్ లీకేజీ అయి భవనంలో ఉండే పాఠ్య పుస్తకాలు, ఇతర రికార్డులు, ఫైల్స్, కంప్యూటర్స్ సైతం తడిసిపోతున్నాయి. అంతేకాకుండా ఈ భవనం ఇరుకుగా ఉండడంతో విధులు నిర్వర్తించే సిబ్బంది, సమావేశాలు, శిక్షణకు వచ్చే ఉపాధ్యాయులకు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు ఎవరూ ఈ సమస్యలను పట్టించుకోవడం లేదు. మరమ్మతులు చేపట్టా లని పలుమార్లు ఉపాధ్యాయులు విజ్ఞప్తులు చేస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



శిథిలావస్థలో ఉన్న ఎమ్మార్సీ భవనం


స్లాబ్ పెచ్చులూడి తేలిన ఇనుప చువ్వలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

బీబీనగర్ మండల వనరుల విద్యా కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీనికి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. చాలా ఏళ్ల నాటి భవనం కావడంతో స్లాబ్ నుంచి పెచ్చులూడుతున్నాయి, భవన మరమ్మతులకు నిధులు కేటాయించి పనులు జరిగేలా చూడాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాను.

– సురేష్‌రెడ్డి, ఎంఈఓ, బీబీనగర్ మండలం

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ధర్నా

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాలలో వేడి రాగి జావ మీద పడి ఇద్దరు విద్యార్థులకు, వంట మనిషికి గాయాలైన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించాలని, ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని బీజేవైఎం, బీఆర్ఎస్‌వీ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘా సంఘాల ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించి పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. పాఠశాల లోపలికి వెళ్లి వాస్తవాలను తెలుసుకునేందుకు విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రయత్నం చేయగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో వారికి, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థికి, వంట మనిషికి మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి రూ.50లక్షలు పరిహారం అందించాలని కోరారు. ధర్నా చేస్తున్న నాయకులతో ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడినప్పటికీ వారు వెనక్కి తగ్గలేదు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు స్థానికసంస్థల అదనపు కలెక్టర్‌ను విచారణ అధికారిగా నియమించారని, గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్‌కు తరలించినట్లు ఆర్డీఓ శేఖర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు దోనూరి వీరారెడ్డి, దుబ్బాక భాస్కర్, నర్రి నరసింహ, దోనూరు నర్సిరెడ్డి, సుర్వి రాజుగౌడ్, శ్రీనివాస్, విద్యార్థి సంఘాల నాయకులు పల్లె మధుకృష్ణ, నలపరాజు రమేష్, సుర్జిత్, రహమాన్, ముక్కులోజు రాఘవ, దొంతగోని అమరేందర్, బాలు తదితరులున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి శామ్యూల్‌ను మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.


సర్వేల్ గురుకుల పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి

భువనగిరిటౌన్ : భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించినందుకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్, బీఎస్పీ , కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అమిత్‌షా చిత్రపటానికి చెప్పుల దండ వేసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన దిష్టిబొమ్మను దహనం కేవీపీఎస్ అధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన తెలిపారు. బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో రోడ్డుపై రాస్తారోకో నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఆయా పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు : భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలెంల విద్యాసాగర్ , యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షు డు మేకల పవన్ భిక్షం, బాలెంల మహేందర్, ఉడుగు మల్లేష్,లింగస్వామి, నరేందర్, ఉపేందర్, జీవన్, కిరణ్ పాల్గొన్నారు.

మోత్కూరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానించడమంటే దేశ ప్రజలను అవమానించడమేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై బీజేపీకి గౌరవం లేదన్నారు.

రాజీనామా చేయాలి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మర్రి అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పించి ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట గుంటి దేవా, బోడ శ్రీను, కూరెళ్ల పరమేష్, పురుగుల శ్రీను, కోక భిక్షం, బోడ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


అడ్డగూడూరు : అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ లక్ష్యం

చౌటుప్పల్ : ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సీపీఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిగ్గా వందేళ్ల క్రితం ఆవిర్భవించిన సీపీఐ దేశంలో అనేక ప్రజా పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. నిరంతరం ప్రజల నడుమనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రామలింగం, శంకర్, వెంకటేష్, నర్సింహ్మ, రెహమాన్, సుధాకర్, సైదులు, శ్రీను, బాబు, ఈశ్వర్ తదితరులుపాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

రామన్నపేట : గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బందెల భిక్షం, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటేశం డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం రామన్నపేట సుభాష్ సెంటర్‌లో పంచాయతీ కార్మికులు నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నకిరేకంటి రాము, గాదె ఎల్లయ్య, మంచాల రేణుక, ఉప్పునూతల నర్సింహ, బూడిద ముత్తయ్య, జినుక లక్ష్మమ్మ, వడ్డెపల్లి రాములు, గాదె సాయిలు, బలుగూరి చెన్నయ్య, బూడిద కళమ్మ, వస్తువాల లక్ష్మమ్మ, మంగమ్మ, కొమ్ము కవిత, ముల్కలపల్లి జయమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భూదాన్‌పోచంపల్లి : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ భాస్కర్, ఎంపీఓ మాజీద్‌లకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మంచాల మధు మాట్లాడారు. కార్యక్రమంలో కార్మికులు కలకొండ బాబు, సలీం, స్వామి, జయమ్మ, శంకరయ్య, శారదమ్మ, కిష్టయ్య, ఇందిరమ్మ పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ పాషా డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ అంజిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఆదిమూలం నందీశ్వర్, పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షులు మాంద్ర శ్రీను, నాయకులు గుడ్డెటి పాపయ్య, లక్ష్మయ్య, మారమ్మ, బుచ్చయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

బొమ్మలరామారం : పంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ర్యాకల శ్రీశైలం అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కారోబార్లను పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు.అనంతరం ఎంపీఓ శ్రీమాలిని, సూపరింటెండెంట్ జ్ఞాన ప్రకాష్ రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీపతి బాల్‌రాజ్, యాదగిరి, ఉపాధ్యక్షులు గంగోజి లక్ష్మీకాంతం, బాలయ్య, వెంకటేష్, శతనారి, నర్స మ్మ, లక్ష్మి, కలమ్మ, బాలమణి, ఎల్లమ్మ పాల్గొన్నారు.

గుండాల : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ పంచాయతీ కార్మికులు గురువారం మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. నిరసన తెలిపిన వారిలో పరశురాములు, గిరిబాబు, యాదయ్య, ఇందిర, వెంకటమ్మ, లక్ష్మి, లింగయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.


రామన్నపేట: సుభాష్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు


భూదాన్‌పోచంపల్లి : ఎంపీడీఓ భాస్కర్‌కు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు


చౌటుప్పల్ రూరల్ : వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

సమ్మె నోటీసులు అందజేత

మోటకొండూర్: గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27,28 తేదీల్లో చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసులను పలువురు పంచాయతీ కార్మికులు గురువారం ఎంపీడీఓ ఇందిరకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కొల్లూరి ఆంజనేయులు, గోసంగి పరమేష్, వడ్డెబోయిన మహేందర్, భైరపాక సర్వయ్య, ఇస్తారి, కిషన్ తదితరులు ఉన్నారు .

బీబీనగర్: గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాడి శ్రీనివాస్, యాదమ్మ, యాదగిరి, బాలయ్య, రమేష్, మల్లేశ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బొమ్మలరామారం : కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా కార్యదర్శి వేముల నరేష్ అన్నారు. మండలంలోని మేడిపల్లి గ్రామంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మేడిపల్లి గ్రామ బూత్ అధ్యక్షుడిగా గుజ్జ కుమార్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జగ్గర్ల ఆనంద్ గౌడ్, చీర గణేష్, ఎర్రోజు మనోహర్ చారి, గోపికృష్ణ, సల్లూరి ప్రహ్లాద, రాజకొండ బాల్‌రాజ్, ముడుగుల అంజనేయులు, ప్రభాకర్, దర్శనం ప్రవీన్ పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం

భూదాన్‌పోచంపల్లి : మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జయ అన్నారు. గురువారం మండలంలోని జలాల్‌పురం, మెహర్‌నగర్ గ్రామాల్లో జరిగిన బూత్ కమిటీల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. అనంతరం జలాల్‌పురం బూత్ నూతన అధ్యక్షుడిగా పాలకూర్ల నవీన్‌గౌడ్, సభ్యులుగా బైరు కృష్ణ, కేసారం శ్రీకాంత్‌రెడ్డి, పున్న నరేశ్, మెహర్‌నగర్ బూత్ అధ్యక్షునిగా ఉపునూతుల శ్రీశైలంను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, పట్టణ అధ్యక్షుడు డబ్బీకార్ సాహెచ్, మండల ప్రధాన కార్యదర్శి బైరు వెంకటేష్‌గౌడ్, కేసారం కృష్టారెడ్డి, కొయ్యడ స్వామి, నర్సింహ పాల్గొన్నారు.


భూదాన్‌పోచంపల్లి : మాట్లాడుతున్న జయ

కొనసాగుతున్న ఆమరణ నిరాహార దీక్ష

భువనగిరిటౌన్ : నిరుపేద ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, నిరుద్యోగులందరికీ ఉపాధి, భూమి లేని వారికి ఒక ఎకరం భూమి, ఇల్లు లేనివారికి 200 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్ల నరేందర్ మహారాజ్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష కొనసాగింది. ఆమరణ నిరాహార దీక్షకు గురువారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాసాల వినోద్ యాదవ్ మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రాణం పోతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీక్ష చేస్తున్న నరేందర్ ఆరోగ్యం క్షీణించి మాట్లాడలేని స్థితిలో ఉన్నాడన్నారు. కనీసం వైద్య పరీక్షలు కూడా నిర్వహించకుండా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. తమ డిమాండ్లు పరిష్కారమ య్యే వరకు దీక్షను విరమించనని నల్ల నరేందర్ స్పష్టం చేశారు. దీక్షకు జై భీమ్ ఆటో యూనియన్, లంబాడీ హక్కుల సాధన సమితి, మహజన గళం కళా కారులు, వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు లింగస్వామి, శాంతి కుమార్, శివ, శ్రీకాంత్, సాయి, మహేష్, రాకేష్, నరేందర్, స్వామి, వెంకటేష్, సాయి కిరణ్, శ్రీకాంత్, పరుశరామ్, గోవర్ధన్, వరుణ్ పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో..

ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్ల నరేందర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి మూడు రోజులు గడుస్తున్నా పట్టించుకోకుండా అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆ పార్టీ కార్యకర్తలు పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. దీంతో గంటపాటు రోడ్డు పై ట్రాఫిక్ జామయ్యింది. కాగా పోలీసులు ధర్మ సమాజ్ పార్టీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.


దీక్షకు మద్దతు తెలుపుతున్న నాయకులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఆలేరురూరల్ : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని డీసీసీబీ మాజీ చైర్మన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆలేరు పట్టణ కేంద్రంలోని స్థానిక జిలా పరిషత్ ఉన్న పాఠశాల మైదానంలో బాల, బాలికల 50వ జూనియర్ జిల్లాస్థాయి కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూల నగయ్య, మున్సిపల్ చైర్మన్ వి.శంకరయ్య, కుమార్, విజయ్, నరేష్, సందీప్, ఉపాధ్యాయులు, రమణ, రజని పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ఆలేరురూరల్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్)ఎన్‌డీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శివర్గ సభ్యుడు కోమటిరెడ్డి అనంతరెడ్డి అన్నారు. గురువారం ఆలేరు పట్టణ కేంద్రంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జన్నె మల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పిడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పంగ రవి, పంగ అంజయ్య, వరలక్ష్మి, బాలమల్లేష్, చంద్రయ్య, రాజయ్య, కరుణాకర్, నాగరాజు, శ్రవణ్, గణేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఆలేరురూరల్ : మండలంలోని కొలనుపాక గ్రామంలో వీరశైవ సమాజ ప్రతినిధుల మండల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా గంగ శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా భయ్యా గౌరప్ప, కార్యదర్శిగా మాటూరి సంతోష్, కోశాధికారిగా ప్రవీణ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంకటార సోమేశ్వర్, మండల వైరాగ్యం చెంద్రశేఖర్, భద్రప్ప, రాజీరు, మహేందర్, సిద్దులు, శివశంకర్, పాల్గొన్నారు.

సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

రామన్నపేట : ధర్మారెడ్డిపల్లి కాలువకు రూ. 129కోట్లు, పిల్లాయిపల్లి కాలువకు రూ. 95కోట్లను ప్రభుత్వం మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి , పట్టణ అధ్యక్షుడు ఎండీ జమీరొద్దిన్ నాయకులు జినుకల ప్రభాకర్, వనం చంద్రశేఖర్, ఎండీ నాజర్, ఎండీ అక్రం, రామిని రమేష్, జెల్ల వెంకటేశం, రమేష్, బొడ్డు శంకరయ్య,లవనం సాయి, అజార్ పలువురు నాయకులు తదతరులు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని తెలంగాణ బాలికల గురుకులం, కళాశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి బోధించారు. అధికారులు, ప్రజాప్రతినిధులుగా విధులు నిర్వహించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సరోజమ్మ, ఉపాధ్యాయినీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.


స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

సంక్షిప్త వార్తలు

సమస్యలు పరిష్కరించాలి

మోత్కూరు : సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమగ్ర శిక్షాఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో కురుమేటి యాదయ్య, మల్లేశం పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

ఆత్మకూరు(ఎం) : ఏఈఓలు రైతులకు అందుబాటులో ఉండాలని ఆలేరు ఏడీఏ పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని పల్లెర్లలో రైతువేదికలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో ఏఓ అపర్ణ, ఏఈఓలు సరిత, మనీష, సౌమ్య, క్రాంతి, శ్రీకర్ పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్లు పట్టివేత

ఆలేరురూరల్ : పట్టణ కేంద్రంలోని రైల్వేగేటు వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి గుట్కా ప్యాకెట్లను గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రజినీకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పాన్ డబ్బా, దుకాణాల్లో తనిఖీలు చేయగా గుట్కా ప్యాకట్ల దొరకడంతో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

అడ్డగూడూరు : ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి బుర్రు అనిల్ అన్నారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వల్లంభట్ల శ్రీనావాసరావు, .శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తి రిమాండ్

భువనగిరిటౌన్ : తుర్కపల్లి మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన అశ్వీన్‌ను బెదిరించి రూ. 50వేలు ఫేన్ పే ద్వారా తీసుకున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన రణవీర్‌రెడ్డి భువనగిరి పట్టణంలోని గంజ్ నుంచి బస్టాండ్‌కు వస్తున్న క్రమంలో తుర్కపల్లి మండలం ముల్కలపల్లికి చెందిన అశ్వీన్ బైక్ రణవీర్‌రెడ్డికి తాకింది. దీంతో రణవీర్‌రెడ్డి అశ్వీన్‌ను బెదిరించి ఫోన్ పే ద్వారా రూ. 50 వేల అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాడు. దీంతో పట్టణ పోలీసు స్టేషన్‌లో అశ్వీన్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు రణవీర్‌రెడ్డికి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రెండు కార్లు ఢీ

భువనగిరిటౌన్ : హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న రెండు కార్లు ఢీ కొన్న సంఘటన పట్టణ శివారులో బైపాస్ రోడ్డులో గురువారం చోటు చేసుకుది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బైక్‌పై వరంగల్ వైపు వెళ్తున్న వ్యక్తి కర్చిప్ పడిపోవడంతో బైక్ ఆపాడు. దీతో వెనుక నుంచి వస్తున్న కారు సడన్ బ్రేక్ వేయడంతో కారు వెనుక వస్తున్న మరో కారుయాగిన కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలలు కాలేదు. కాగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

అక్రమ బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తుల అరెస్టు

వలిగొండ : అక్రమ బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలోని పులిగిల్లలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పులిగిల్లకు చెందిన ముగ్గురు వ్యక్తులు బహిరంగ ప్రదేశంలో ఎటువంటి అనుమతులు లేకుండా పేలుళ్లకు పాల్పడుతుండడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి 10 జిలేటిన్ స్టిక్స్, 48 డిటోనేటర్స్, ఒక మెగ్గర్ బాక్స్, రెండు బైండింగ్ వైర్ల బిండళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ తెలిపారు.

కేరళ ట్రెక్కింగ్ క్యాంపునకు బండారి చంద్రశేఖర్ ఎంపిక

వలిగొండ: మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థి బండారి చంద్రశేఖర్ కేరళ రాష్ట్రంలో ఈ నెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న ట్రెక్కింగ్ క్యాంపునకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 31(టీ) బెటాలియన్ నల్లగొండ తరపున చంద్రశేఖర్ ఈ ట్రెక్కింగ్ క్యాంపులో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. చంద్రశేఖర్‌ను కళాశాల ఎన్‌సీసీ కేర్‌టేకర్ కొంపెల్లి నరేష్, ఉపాధ్యాయులు పరుశరాములు, హనీఫ్, గణేష్, మురళీ, వెంకటాచారి, విజయ్, రవి, స్వప్న అభినందించారు.

బీరు సీసాతో వ్యక్తిపై దాడి

చౌటుప్పల్: మద్యం దుకాణంలోని సిట్టింగ్ రూంలో ఓ వ్యక్తిపై ఇద్దరు యువకులు బీరు సీసాతో దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామానికి చెందిన మొగిలిచర్ల కృష్ణ చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీసాయి వైన్స్ సిట్టింగ్ రూంలో మద్యం తాగుతున్నాడు. పక్క టేబుల్‌పై చౌటుప్పల్‌కు చెందిన ఉపేందర్, మండలంలోని చిన్నకొండూరు గ్రామానికి చెందిన వంశీ సైతం మద్యం తాగుతున్నారు. ఈ క్రమంలో కృష్ణకు, యువకుల మధ్య వాగ్వాదం జరిగింది. మాటామాట పెరగడంతో ఇద్దరు యువకులు కలిసి బీరు సీసాతో కృష్ణ తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గుండాల: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారం ఎత్తుకెళ్లారు. ఈ ఘటన గుండాల మండలం రామారం గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రామారం గ్రామానికి చెందిన అన్‌రెడ్డి సత్తిరెడ్డి గురువారం ఉదయం తన ఇంటికి తాళం వేసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. సాయంత్రం వ్యవసాయ బావి నుంచి ఇంటికి తిరిగి రాగా.. తన ఇంటి ముందు బైక్‌పై గుర్తుతెలియని వ్యక్తి హెల్మెట్ ధరించి ఉండటం గమనించాడు. మరో వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి ఇంటి తాళం పగుల గొట్టి బీరువాలోని తులంన్నర బంగారాన్ని ఎత్తుకెళ్తుండగా సత్తిరెడ్డి గమనించి గేటు వేసే ప్రయత్నం చేయగా బైక్‌పై ఉన్న వ్యక్తి హారన్ కొట్టడంతో ఇంట్లో ఉన్న మరో వ్యక్తి ప్రహరీ దూకి బైక్ ఎక్కి పారిపోయారు. బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.